క్లుప్తంగా

సైరన్ లాకర్లతో ఇళ్లకు రక్షణ



సైరన్ లాకర్లపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ సుబ్బారెడ్డి

రొంపిచెర్ల: సైరన్ లాకర్లతో దొంగల బారి నుంచి ఇళ్లకు రక్షణ పొందవచ్చని ఎస్‌ఐ సుబ్బారెడ్డి అన్నారు. సైరన్ లాకర్లపై సోమవారం ఆయన పోలీస్ స్టేషన్‌లో అవగాహన కల్పించారు. ఊరికి దూరంగా ఉన్న ఇళ్లకు సైరన్ లాకర్లు ఏర్పాటు చేసుకోవాలని, వీటిని దొంగలు తాకితే అలారం మోగుతుందన్నారు. దీంతో దొంగలు పారిపోతారన్నారు. సైరన్ లాకర్ ధర రూ.500 అని, ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని, అవసరమైన వారు పోలీసులను సంప్రదించాలని కోరారు. ప్రజలు ఇళ్లకు తాళం వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు తమకు సమాచారం ఇస్తే వారి ఇళ్లపై నిఘా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ మధు, పోలీసులు పాల్గొన్నారు.

పేదల ఇళ్లు కూల్చడమే రుణం తీర్చుకోవడమా..?

- సీఎంకు కాంగ్రెస్ నాయకుల ప్రశ్న



బాధితులతో కాంగ్రెస్ పార్టీ నాయకులు

శాంతిపురం: కుప్పం ప్రజల రుణం తీర్చుకోలేనని ఎన్నికల ముందు పదేపదే చెప్పిన నారా చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చాక ఇక్కడ ఉన్న పేదల ఇళ్లను కూల్చి వారి రుణం తీర్చుకుంటున్నారా? అని కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించారు. ఇటీవల సంతూరు వద్ద అధికారులు కూల్చి వేసిన ఇళ్లను ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆవుల గోపి ఆధ్వర్యంలో సోమవారం పరిశీలించి బాధితులను పరామర్శించారు. 26 ఏళ్లుగా నివాసం ఉంటున్న వారి ఇళ్లను కూలదోసి, వారికి నిలువ నీడ లేకుండా చేశారని మండిపడ్డారు. కుప్పంలో ఇలాంటి దమనకాండను తమ పార్టీ ఖండిస్తోందని చెప్పారు. బాధితులకు ప్రత్యామ్నాయ ఇంటి స్థలాలు, పక్కా ఇళ్లను మంజూరు చేయాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో జూదమాడుతున్న ముగ్గురిని వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. నగరంలోని పుత్తూరు రోడ్డులో ఉన్న సీకే పల్లె వద్ద పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వన్ టౌన్ పోలీసులు సీకే పల్లె వద్ద దాడులు చేసి ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1600 స్వాధీనం చేసుకున్నారు.

మొగిలిలో రాహుకేతు పూజలు



మొగిలి శివాలయంలో రాహుకేతు పూజలు చేస్తున్న భక్తులు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వయంభు శ్రీమొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ వార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉదయం రాహుకాల సమయం 7.30 నుంచి 9 గంటల మధ్య రాహు, కేతు, సర్పదోష నివారణ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని దోష నివారణ పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

స్వీపర్ల జీతాలు బ్యాంకులో జమ చేయండి



స్వీపర్లు, ఆయాలతో కలిసి మాట్లాడుతున్న నాగరాజన్

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లు, ఆయాలకు వేతనాలను బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షులు నాగరాజన్ డిమాండ్ చేశారు. చిత్తూరులోని కార్మికుల సమావేశం సోమవారం సంతపేటలో నిర్వహించారు. ఉద్యోగులకు రాష్ట్రం మొత్తం వాళ్ల బ్యాంకు ఖాతాల్లో వేతనాలు జమ చేస్తుంటే.. చిత్తూరు కార్పొరేషన్ అధికారులు చేతికి డబ్బులు ఇవ్వడం అవినీతికి ఆజ్యం పోసినట్లేనన్నారు. స్వీపర్లు, ఆయాల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జయకుమారి మాట్లాడుతూ, వేతనాలతో పాటు కార్మికులకు యూనిఫాం, క్లీనింగ్ మెటీరియల్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నేతలు భువనేశ్వరి, ప్రభావతి, రమేష్, సెల్వి, మేరి తదితరులు పాల్గొన్నారు.

రగులుతోంది మొగలి పొద..!



సయ్యాటలాడుతున్న సర్పాలు

రగులుతోంది మొగలి పొద..
వగలమారి కన్నె ఎద– అనే లెవెల్లో మండలంలోని చింతపర్తివారిపల్లెలో రెండు సర్పాలు సయ్యాటలాడాయి. గ్రామంలోని గంగమ్మ ఆలయం వెనుక వైపు ఓ నాగుపాము, జెర్రిపోతు ఒకదానినొకటి పెనవేసుకుంటూ, మెలిదిరుగుతూ..తమ బుస్సస్సస్సల కేళితో ప్రపంచాన్ని మరచిపోయాయి. పొలం పనులకు వెళ్తున్న రైతులు వీటి సయ్యాటను దూరం నుంచి ఉత్సుకతతో తిలకించారు. వాటి కేళీవిలాసం ముగిసాక అవి పొలాల వైపు వెళ్లి పోయాయి. ఇక, రైతులు కూడా ఎవరి దారిన వారు వెళ్లిపోయారు. –సదుం

తాంబూలం.. ప్రియం



పలమనేరులో విక్రయిస్తున్న తమలపాకులు

పలమనేరు: తాంబూల ప్రియులకు ఇది షాకింగ్ వార్తే. రోజూ ఎర్రటి నోటి కోసం ఆకు, వక్కా నమిలే వాళ్లు ఆకాశాన్నంటుతున్న తమలపాకు ధరలతో ఇక నోర్మెళ్లబెట్టాల్సిన పరిస్థితి కలుగుతోంది. ఈనెల 1న కట్ట తమలపాకుల కట్ట రూ.170 వరకూ ఉండగా ఇప్పుడు కట్ట తమలపాకులు(వంద ఆకులు) ధర రూ.300 దాటింది. ఇది ఇంకా పెరిగే అవకాశం ఉందని తమలపాకు వ్యాపారులు చెబుతున్నారు. స్థానికంగా ఉంటే తమలపాకు తోటల్లో ఈనెలాఖరు వరకు తీగలు దించే కాలం కావడంతో డిమాండ్‌కు సరిపడా సరఫరా లేదు. దీంతో ధరల పెరుగుదలకు కారణమైందని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం కర్ణాటకలోని తుంకూరు ప్రాంతం నుంచి ఇక్కడికి తమలపాకులు వస్తున్నాయి. ఏదేమైనా ఇలాంటి అగ్గి ధరల్లో తాంబూలం వేసినట్టేని తాంబూల ప్రియులు ఉసూరుమంటున్నారు.

ఆకట్టుకున్న ర్యాలీ



పుంగనూరులో ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు చేస్తున్న ర్యాలీ

పుంగనూరు: పట్టణంలోని ట్రావెలర్స్ బంగ్లా నుంచి సోమవారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సభ్యులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ ఆవిర్భవించి వందేళ్ల వసంతంలోకి అడుగిడిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. క్రమశిక్షణతో పురవీధులలో నినాదాలు చేస్తూ చేసిన ర్యాలీ ప్రజల దృష్టిని ఆకర్షించింది.

నిఘా నీడలో టెన్త్ పరీక్షలు







రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు, పలమనేరు: విద్యార్థులను తనిఖీ చేసి సెంటర్‌లోకి పంపుతున్న పోలీసులు, వి.కోట: పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

- రొంపిచెర్ల కేంద్రాల్లో సీసీ కెమెరాలు

రొంపిచెర్ల: రొంపిచెర్ల మండలంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సీసీ కెమెరాల నిఘా, పోలీస్ బందోబస్తు నడుమ సాగాయి. రొంపిచెర్లలో ప్రతి ఏటా టెన్త్ పబ్లిక్ పరీక్షలలో జోరుగా మాస్ కాపీయింగ్ జరుగుతోందని, దీనివల్ల కష్టపడి చదివిన విద్యార్థులకు న్యాయం జరగడం లేదని జిల్లా కలెక్టర్, డీఈఓలకు విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో జిల్లా అధికారులు ప్రత్యేకంగా పరీక్ష కేంద్రాలలోని గదులకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. బాలుర ఉన్నత పాఠశాలలో 171 మందికిగాను 167 మంది, బాలికల ఉన్నత పాఠశాలలో 99 మంది పరీక్షలకు హాజరయ్యారు. రొంపిచెర్ల బాలుర పరీక్ష కేంద్రాన్ని ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి డాక్టర్ ప్రభాకర్ తనిఖీ చేశారు. కార్యక్రమంలో చీఫ్ సూపరింటెండెంట్లు ఫజులుల్లా, మంజునాథ, ఎంపీఓలు ఇందిర, శ్రీనివాసులు పాల్గొన్నారు.

శాంతిపురంలో ప్రశాంతం

శాంతిపురం: పదవ తరగతి పబ్లిక్ పరీక్షల తొలి రోజైన సోమవారం మండలంలోని నాలుగు కేంద్రాల్లోనూ ప్రశాంతంగా సాగాయి. మొత్తం 743 మంది విద్యార్థులకు గాను 736 మంది హాజరయ్యారని ఎంఈఓ చంద్రశేఖర్ తెలిపారు. శాంతిపురం జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ స్కూలు, రాళ్లబూదుగూరు జెడ్పీ హైస్కూళ్లలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం విదితమే.

విద్యార్థుల తల్లిదండ్రుల ఆగ్రహం



జూనియర్ కళాశాల వద్ద హాల్‌టిక్కెట్ వివరాలను ఆలస్యంగా అంటించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

పలమనేరు: పట్టణంలోని ఏడు పరీక్ష కేంద్రాలలో తెలుగు పరీక్షకు 1,372మందికిగాను 1,368 హాజరయ్యారని ఎంఈఓ లీలారాణి తెలిపారు. అన్ని కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించినట్టు ఎంఈఓ-2 బాలసుందరం తెలిపారు. పట్టణంలోని బాలికోన్నత పాఠశాల, ఎబీనాబెట్టిని పాఠశాలల్లో ఫ్లైయింగ్ స్క్వాడ్ మెంబర్ అరుణ్‌కుమార్ తనిఖీ చేశారు. స్థానిక జూనియర్ కళాశాల సెంటర్ వద్ద నిర్వాహకులు 9 గంటలకు హాల్‌టికెట్ నంబర్లను అంటించడంతో పిల్లలు గందరగోళానికి గురయ్యారు. దీంతో తల్లిదండ్రులు నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

పుంగనూరులో 13మందిగైర్హాజరు

పుంగనూరు: పట్టణంలో పదో తరగతి పరీక్షలకు 1335 మంది పరీక్షలకు హాజరయ్యారని, 13 మంది హాజరు కాలేదని ఎంఈవోలు చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్డెన్నశెట్టి తెలిపారు. విద్యార్థులు తల్లిదండ్రులతో రావడంతో ఆయా పరీక్ష కేంద్రాల వద్ద సందడి నెలకొంది.

పులిచెర్ల మండలంలో ముగ్గురు..

పులిచెర్ల(కల్లూరు): సోమవారం నుంచి ప్రారంభమైన పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈఓలు సిద్ధరామయ్య, తాతయ్య తెలిపారు. మండలంలోని కల్లూరు కేంద్రంలో 205 మందికి గాను 202 మంది, మంగళంపేటలో 110మందికి 110 మంది హాజరయ్యారని తెలియజేశారు.

సదుంలో నలుగురు..

సదుం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షలకు సదుం, పాలమంద, బూరగమంద, చెరుకువారిపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థులతో పాటు ఎంజేపీ గురుకుల పాఠశాల, ఓ ప్రైవేటు పాఠశాల విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 249 మందికి గాను 245 మంది హాజరయ్యారని ఎగ్జామినేషన్ చీఫ్ సూపరింటెండెంట్ నిరంజన్ కుమార్ తెలిపారు. పరీక్షా కేంద్రాన్ని ఇన్‌చార్జ్ తహశీల్దార్ మారుఫ్ హుస్సేన్ పరిశీలించారు.



పుంగనూరు: కొత్తయిండ్లు పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రుల కోలాహలం

చౌడేపల్లెలో 8మంది..

చౌడేపల్లె: స్థానిక ఉన్నత పాఠశాలలో పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు 492 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎంఈఓ కేశవరెడ్డి తెలిపారు. తొలిరోజు రెండు పరీక్ష కేంద్రాల్లో ఎనిమిది విద్యార్థులు గైర్హాజరయ్యారని చెప్పారు.

వి.కోటలో 17మంది..

వి.కోట: మండలంలోని 6 సెంటర్లలో నిర్వహించిన టెన్త్ పరీక్షలకు 1104 మంది హాజరు కావాల్సి ఉండగా 17 మంది గైర్హాజరయ్యారని. 1087 మంది హాజరయ్యారని ఎంఈఓ చంద్రశేఖర్ తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

మామిడికి ఫ్రూట్ కవర్లను వాడాలి



మామిడికి కవర్లను కట్టిన దృశ్యం(ఫైల్)

పలమనేరు: మామిడికి ఫ్రూట్ కవర్లను కడితే చీడపీడల బెడద లేకుండా కాయ మంచి రంగు, నాణ్యతతో దిగుబడి వస్తుందని, తద్వారా మంచి ధర పలుకుతుందని స్థానిక హార్టికల్చర్ ఆఫీసర్ లక్ష్మీప్రసూన అన్నారు. తమ శాఖ ద్వారా రైతులకు 50శాతం సబ్సిడీతో మామిడి కవర్లను అందజేస్తున్నట్టు సోమవారం ఆమె తెలిపారు. కవర్ పూర్తి ధర రూ.2 అని, 50శాతం సబ్సిడీతో రూపాయి చొప్పున ఓ రైతుకు రెండున్నర ఎకరాలకు వెయ్యి కవర్లను అందజేస్తున్నట్టు తెలిపారు. మామిడి నిమ్మకాయ సైజులో ఉన్నప్పుడు ఈ కవర్లకు కాయలకు కట్టాలన్నారు. కావాల్సిన రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రాలు లేదా తనను సంప్రదించాలని కోరారు.

ఎమ్.టెక్, ఎంబీఏ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న దృశ్యం

కుప్పం రూరల్: కుప్పం ఇంజినీరింగ్ కళాశాలలో అటానమస్ హోదాలో నిర్వహించిన ఎమ్.టెక్, ఎంబీఏ ఫలితాలను సోమవారం ఆ కళాశాల చైర్మన్ బీసీ నాగరాజు, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ పరిశీలకులు డాక్టర్ చిత్ర విడుదల చేశారు. కళాశాలకు చెందిన కంప్యూటర్ విభాగంలో అనంగి జ్యోత్స్న,87.97% మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. వీఎల్ఎస్ఐ విభాగానికి చెందిన టి. హర్షితరాజ్ 86.76% మార్కులతో ద్వితీయ స్థానం, కంప్యూటర్ సైన్సులో ఎం. ఏకాంబరం 86.49% మార్కులతో తృతీయ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. వీరే కాకుండా ఎక్కువ మంది విద్యార్థులు డిస్టింక్షన్, ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. ఎంబీఏ ఫలితాల్లో బీఎల్. నాగలక్ష్మి 87.75% మార్కులతో ప్రథమ స్థానం, సౌమ్యశ్రీ 86.25% మార్కులతో ద్వితీయ స్థానం, ఎం.ఉదయశ్రీ 84.38%మార్కులతో తృతీయ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. వారిని చైర్మన్‌తో పాటు వైస్ చైర్మన్ సునీల్‌రాజ్, సీఈవో సాగర్‌రాజ్ అభినందించారు. కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ మునీంద్ర, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాలికలతో అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన శిక్షలు



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి ఆరీఫా షేక్

పుంగనూరు: బాలికలతో ఎవరు అసభ్యంగా ప్రవర్తించినా కఠిన శిక్షలు తప్పవని సీనియర్ సివిల్ జడ్జి ఆరీఫా షేక్ హెచ్చరించారు. సోమవారం స్థానిక మేలుపట్ల బాలికల హైస్కూల్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.విద్యాహక్కు, బాల్య వివాహాల నిషేధం, పోక్సో, గుడ్ టచ్, బ్యాడ్‌టచ్..ఇత్యాది వాటిపై అవగాహన కల్పించి న్యాయమూర్తి మాట్లాడారు.బాలికలు తమకు ఎదురయ్యే సమస్యలకు కృంగిపోరాదని, ధైర్యంగా తల్లిదండ్రులకు, సన్నిహితులకు సమస్యను తెలిపి ఎదుర్కోవాలన్నారు. బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడితే వారిపై పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేసి కఠిన శిక్ష తప్పదన్నారు. సమాజంలో మహిళలకు సముచిత గౌరవం, ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మణ్ కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు గంగప్ప, భారతి తదితరులు పాల్గొన్నారు.

కల్లాడులో నేటి నుంచి జాతర



గంగమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న గ్రామస్తులు

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లె పంచాయతీ కల్లాడులోని గంగమ్మ ఆలయంలో మంగళవారం నుంచి మూడురోజుల పాటు నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త అమరనాథ రెడ్డి తెలిపారు. సోమవారం ఆలయంలో సోమవారం గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక్కడి జాతరలో తొమ్మిది గ్రామాలకు చెందిన వారు అమ్మవారికి మొక్కులు చెల్లించడం పరిపాటి. మంగళవారం రాత్రి అమ్మవారి శిరస్సు మెరవణి, 19న జాతర, 20న అమ్మవారి జలధి కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద భక్తుల కాలక్షేపం కోసం పండరి భజనలు, పౌరాణిక, సాంఘిక నాటకాల ప్రదర్శన, కోలాటలు, హరికథాగానం తదితర కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు చెప్పారు. అలాగే మూడు రోజుల పాటు అన్నదానం చేస్తారు.

నోటీస్ బోర్డు

19 మార్కెట్ల వేలం

పుంగనూరు: మున్సిపాలిటీ పరిధిలోని వారపు సంత, దినసరి మార్కెట్, ప్రైవేటు వాహనాల వేలం పాటలను ఈనెల 19న ఉదయం 11 గంటలకు నిర్వహిస్తామని కమిషనర్ మధుసూదన్ రెడ్డి తెలిపారు. గతంలో నిర్వహించిన వేలం పాటలకు గుత్తేదారులు రాని కారణంగా వేలం రెండుసార్లు వాయిదా వేశామని, ఆసక్తి గల వ్యాపారులు వేలంలో పాల్గొనాలని ఆయన కోరారు.

23, 24న గంగజాతర

సదుం: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో ఈనెల 23, 24న గంగజాతర నిర్వహించనున్నారు. సదుం, బూరగమంద గ్రామాలలో జాతరకు సంబంధించి ఆదివారం అర్ధరాత్రి చాటింపు వేశారు. ఉగాది ముందున వచ్చే ఆది, సోమవారాలు జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. బూరగమందలో జాతర ఏర్పాట్లపై వ్యవసాయ సలహా మండలి మాజీ సభ్యుడు పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి గ్రామస్తులతో చర్చించారు.

రైల్వే అండర్ బ్రిడ్జికి స్థల పరిశీలన

నగరి: మున్సిపల్ పరిధిలోని ఏకాంబరకుప్పం ప్రాంతంలో ప్రస్తుతం ఉన్న అండర్ బ్రిడ్జి చాలా చిన్నదిగా ఉంది. వాహనాలు ప్రయాణించే విధంగా మార్చాలంటే స్థలం కూడా ఆ ప్రాంతంలో లేదని మరో ప్రాంతంలో అండర్‌బ్రిడ్జి నిర్మించి ఇవ్వాలని బీజేపీ నేతలు రైల్వే అధికారులను కోరారు. ఏకాంబరకుప్పం ఇండియన్ బ్యాంకు ఉన్న దారిలో అండర్‌బ్రిడ్జి నిర్మిస్తే అనుకూలంగా ఉంటుందని తెలిపారు. అయితే ఇందుకు మున్సిపల్ అధికారుల అనుమతి కావాలని రైల్వే అధికారులు కోరడంతో సోమవారం మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన బీజేపీ నేతలు ఈ విషయం తెలియజేశారు. బీజేపీ ప్రతిపాదిత ప్రాంతాన్ని కమిషనర్ ప్రత్యక్షంగా వెళ్లి పరిశీలించారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద పెన్షనర్ల ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

- బకాయిలు తీసుకోకుండానే చాలామంది మరణిస్తున్నారు

పలమనేరు: దీర్ఘకాలంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఇకనైనా పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విశ్రాంత ఉద్యోగులు ఆందోళన చేశారు. అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ, గత ఏడాది ఏర్పాటు చేయాల్సిన పీఆర్‌సీ కమిషన్ ఇప్పటివరకూ ఏర్పాటు చేయకపోవడంతో ఐఆర్ రాలేదని, అంతేకాకుండా తమకు రావాల్సిన డీఆర్, పీఆర్సీ బకాయిలు ప్రభుత్వం నుంచి తీసుకోకుండానే చాలామంది పింఛనుదారులు మృతి చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈహెచ్‌ఎస్ కార్డులపై వైద్యం చేయలేమని ఆస్పత్రుల్లో తిరస్కరిస్తున్నారని, మెడికల్ రీయింబర్స్‌మెంటుకు ఆస్పత్రుల్లో అడ్మిట్ అవుదామంటే ఆర్థిక వెసులుబాటు లేక చాలామంది వైద్యసేవలు పొందలేని దుస్థితిలో ఉన్నారని, వయోవృద్ధుల సమస్యలను కూటమి ప్రభుత్వం నాన్చకుండా ఇకనైనా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో స్థానిక అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు క్రిష్ణమూర్తి, గురురాజారావు, సభ్యులు పాల్గొన్నారు.



పుంగనూరులో విశ్రాంత ఉద్యోగుల ర్యాలీ

పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు చేయాలి

పుంగనూరు: పన్నెండవ పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు చేసి, తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విశ్రాంత ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. సోమవారం విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ స్థానిక శాఖ అధ్యక్షుడు చెంగారెడ్డి , రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ, ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలను జాప్యం చేయకుండా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

14 చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు

చిత్తూరు కార్పొరేషన్: వేసవిని దృష్టిలో ఉంచుకుని నగరంలోని పలు ప్రాంతాల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నట్లు ట్రాన్స్‌కో డీఈ ప్రసాద్ తెలిపారు. విద్యుత్ అంతరాయం లేకుండా సెక్షన్ల వారీగా ఈఈ మునిచంద్ర ట్రాన్స్‌ఫార్మర్ల కోసం నివేదిక ఇవ్వాలని ఆదేశించారన్నారు. ఈ మేరకు నగరంలో మొత్తం 14ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని గుర్తించామన్నారు. వీటికి పాలన పరంగా అనుమతులు వచ్చాయని చెప్పారు. కాజూరులో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 160 కేవీ పెట్టామన్నారు. తేనబండలో 25 కేవీ స్థానంలో 63 కేవీ, దర్గామిట్టలో 16 కేవీ స్థానంలో 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామన్నారు. సంజయ్ గాంధీనగర్, డీఐరోడ్డు, మిట్టూరు, ఇరువారం, ఇందిరానగర్‌తో పాటు పలు ప్రాంతాల్లో మెటీరియల్ వచ్చాక వీటిని బిగించనున్నట్లు చెప్పారు. ఏఈలు తమ సెక్షన్ల పరిధిలో లైన్ ఇన్‌స్పెక్టర్ల ద్వారా లైన్ మెయింటెనెన్స్ పనులు చేయించాలన్నారు. గిరింపేట సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయను

ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో విచారణ



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: ప్రజల సమస్యలు, వాళ్లు ఇచ్చే వినతులు, ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో విచారణ చేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. చిత్తూరు నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించి, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వచ్చిన అర్జీలను పరిశీలించి పరిష్కరించేలా చూడాలని సిబ్బందికి ఆదేశించారు. ఆర్థిక అంశాలతో ముడిపడ్డ వాటిని ప్రాధాన్యత ఆధారంగా గుర్తించాలన్నారు. ఇతర వినతులను తక్షణం పరిశీలించాలని ఆదేశించారు. ఈ గ్రీవెన్స్‌లో మునిసిపల్ ఇంజినీర్ వెంకటరామిరెడ్డి, మునిసిపల్ ప్రజారోగ్యశాఖ అధికారి డాక్టర్ లోకేష్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.